## క్లుప్తంగా

### చెక్కుల పంపిణీ

**పులివెందుల రూరల్ :** పట్టణంలోని తన స్వగృహంలో సోమవారం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పులివెందుల నియోజకవర్గానికి చెందిన 10 మంది అనారోగ్యానికి గురై వివిధ ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్నారు. వీరందరికి ఎమ్మెల్సీ సీఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షల చెక్కులను మంజూరు చేయించారు.

### పరిహారం వెంటనే ఇప్పించాలి

**జమ్మలమడుగు :** కొండాపురం మండలంలో గండికోట ముంపునకు గురైన గ్రామాల ప్రజలు వెంటనే మిగిలిన పరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక ఆర్డీఓ సాయిశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట ముంపువాసులకు మొదటి విడత గ్రామాలకు 3.25 లక్షల రూపాయలు ఇంకా ఇవ్వవలసి ఉంది. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, చౌటిపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### భవన నిర్మాణానికి విరాళం

**పులివెందుల టౌన్ :** పులివెందులలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి నూతన భవన నిర్మాణం కోసం జెఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ శేషమహేశ్వరమ్మ రూ.20వేల విరాళాన్ని అందించారు. సోమవారం స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలోని ఆమె చాంబర్‌లో సేవా సమితి అధ్యక్షుడు రాజు, కార్యదర్శి సునీతలకు రూ.20 వేల నగదును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ హితం కొరకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి అందిస్తున్న సేవలకు భవన నిర్మాణం అవసరం ఎంతో ఉందని, అందుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా విరాళాలు అందించి సమాజ సేవలకు తోడ్పాటునందించాలన్నారు.

### దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

**పులివెందుల టౌన్ :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా స్థానిక వికలాంగుల కమ్యూనిటీ భవనంలో సోమవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో 30 మంది దివ్యాంగులకు ట్రాఫిక్ సీఐ హాజీవల్లి దుప్పట్లు పంపిణీ చేశారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రాణాలర్పించిన పోలీసుల ఆత్మశాంతి కొరకు వారు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

### శనగ విత్తనాలు పంపిణీ

**ముద్దనూరు :** రాయితీతో మంజూరైన శనగ విత్తనాలను సోమవారం అధికారులు పంపిణీ చేశారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య, ఏవో వెంకటకృష్ణారెడ్డిలు రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేశారు. విత్తనాలు పొందిన రైతులు విత్తనశుద్ధి చేసిన తర్వాతే విత్తాలని వారు సూచించారు.

### పాడిపంటలు మాసపత్రిక రైతులకు వరం

**ముద్దనూరు :** వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వెలుబడుతున్న పాడిపంటలు మాసపత్రిక రైతునేస్తమని మండల వ్యవసాయాధికారి తెలిపారు. రైతులకు అవసరమైన సమాచారం, సాంకేతిక పరిజ్ఞానం తదితర సూచనలన్నీ ఈ పుస్తకం ద్వారా పొందవచ్చని ఆయన తెలిపారు. రూ.300 సంవత్సర చందా చెల్లించి, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులంతా ఈ పుస్తకాన్ని పొందాలని ఏవో సూచించారు.

### కంపచెట్లను తొలగించండి

**లింగాల :** స్థానిక ఎస్సీ కాలనీలోని సీసీ రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిని వెంటనే తొలగించాలని ఎస్సీ కాలనీ ప్రజలు సోమవారం ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. ఏపుగా పెరిగిన కంపచెట్లవల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, విష పురుగులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని వారు వినతిపత్రంలో తెలిపారు. ఎంపీడీఓ స్పందిస్తూ త్వరలో గ్రామ పంచాయతీ ద్వారా కంపచెట్లు తొలగించే పనులు నిర్వహిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

### హామీలను నెరవేర్చాలి

**ఎర్రగుంట్ల :** కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంలో బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీసీ సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఎస్టేట్ కార్యలయంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీలకు బీసీ రక్షణ చట్టంను రూపొందించి వెంటనే అమలు చేయాలన్నారు. సంక్షేమ సంఘంకు రూ.30 వేల కోట్లు బీసీ కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయాలన్నారు. బీసీలందరు ఆర్థికాభివృద్ధి కోసం రుణాలును మంజూరు చేయించాలని, అంతేకాక కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలలో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి ఖోఖో ఎంపికలు

**చింతకొమ్మదిన్నె (వల్లూరు) :** మండలంలోని బయనపల్లె శ్రీవెంకటేశ్వర హైస్కూల్లో సోమవారం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కడప జిల్లాస్థాయి అండర్-14, 17 బాల బాలికలు ఖోఖో ఎంపికలు జరిగాయి. ఇందులో 40కి పైగా జట్లు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ అరుణకుమారి, వెంకటేశ్వర హైస్కూల్ ప్రధా నోపాధ్యాయుడు దీన దయాల్, అగ్రికల్చర్ కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, బాలబాలికలు పాల్గొన్నారు.

# వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి గడ్డలు

- తోటలలో ఆరబెట్టుకుంటున్న రైతులు
- ధరలు ఉన్నా ముందుకు రానీ వ్యాపారులు



వర్షానికి తడిసిన ఉల్లి గడ్డలు

**వేముల :** తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు ఉల్లి రైతులను దెబ్బతీశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత వారం రోజులుగా వర్షాలు పడుతున్నాయి. అధిక వర్షాలు పడటంతో ఉల్లి తోటలలో వర్షపు నీరు నిల్వ ఉంది. దీంతో ఉల్లి గడ్డలకు తెగుళ్లు సోకి మొదలు వద్ద గడ్డలు కుళ్లిపోతున్నాయని రైతులు అంటున్నారు. పులివెందుల నియోజకవర్గంలోని ఉల్లి పంట 3 వేల ఎకరాలలో సాగైంది. ముందస్తు ఉల్లి సాగు చేసిన రైతులు గడ్డలను పీకివేసి అమ్ముకున్నారు. జూన్ నెలలో రైతులు ఉల్లి పంటను సాగు చేసుకున్నారు. అలస్యంగా సాగు చేసిన తోటలలో ఉల్లి దిగుబడులను పీకి వేయాల్సి ఉంది. అయతే వర్షాలతో ఉల్లి గడ్డలను పీకేందుకు రైతులు మొగ్గు చూపడంలేదు. ఉల్లి గడ్డలను పీకివేసిన తర్వాత వర్షాలు కురిస్తే గడ్డలు దెబ్బతినే ప్రమాదం ఉంది. దీంతో రైతులు తుఫాన్ ప్రభావం తగ్గిన అనంతరం ఉల్లి గడ్డలను పీకేందుకు ఎదురు చూస్తున్నారు. అయితే గత వారం రోజులుగా ఏదోక సమయంలో పదును వర్షం కురుస్తోంది. దీంతో రైతులు ఉల్లి గడ్డలను పీకేందుకు వెనుకాడుతున్నారు.

**తోటలలో ఆరబెట్టుకుంటున్న రైతులు :**
ఉల్లి సాగు సున్నితమైన పంట. తెగుళ్లకు తట్టుకునే పంట కాకపోవడంతో రైతులు ముందు జాగ్రత్తలు తీసుకుని కాపాడుకున్నారు. ఉల్లి పంట కాలం పూర్తి కావడంతో ఉల్లి గడ్డలను పీకేందుకు సిద్ధమైనా వర్షాలతో పీకలేదు. కొంతమంది రైతులు వర్షాలకు తెరిపి ఇచ్చిన సమయంలో ఉల్లిగడ్డలను పీకివేశారు. పీకి వేసిన ఉల్లిగడ్డలను గెనాలపై వేశారు. ఉల్లిగడ్డలు పీకిన అనంతరం వర్షాలు పడటంతో గడ్డలను ఆరబెట్టుకుంటున్నారు. తేమ ఎక్కువగా ఉండటంవల్ల గడ్డలు కింద భాగం దెబ్బతింటాయనే ఉద్దేశ్యంతో ఉల్లిగడ్డలను తిరగవేస్తున్నారు. కింద భాగంపైకి పైభాగం కిందకు ఉండేలా ఉల్లి గడ్డలు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**ఉల్లి సాగులో తగ్గిన దిగుబడులు :**
ఈ ఏడాది ఉల్లి సాగులో దిగుబడులు తగ్గిపోయాయి. ఉల్లి పంటను జూన్ నెలలో సాగు చేశారు. సాగు మొదలు ఉల్లి పంటకు తెగుళ్లు సోకాయి. తెగుళ్ల నివారణకు మందులు కొట్టినా అదుపులోకి రాలేదు. గడ్డలు ఊరే సమయంలో ఉష్ణోగ్రతలు పెరగడం వర్షాలు లేకపోవడంతో ఉల్లి పంటక తెల్ల తెగులు సోకింది. దీంతో కొంత మేర ఉల్లి పంట దెబ్బతింది. తెగుళ్లతో సాగులో దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయని రైతులు అంటున్నారు. ఎకరాకు 80 నుంచి 100 క్వింటాళ్ల దిగుబడులు ఉంటాయని ఆశించామని.. తెగుళ్లతో ఎకరాకు 60 నుంచి 80 క్వింటాళ్ల మేర దిగుబడులు అయ్యే పరిస్థితిలేదని రైతులు వాపోతున్నారు.



తడిసిన ఉల్లిగడ్డలను ఆరబెడుతున్న రైతులు

**ధరలు ఉన్నా.. ముందుకు రానీ వ్యాపారులు :**
ఈ ఏడాది ఉల్లి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దిగుబడులు అందిన మొదట్లో క్వింటా రూ.4 వేలకు ధర పలికింది. ప్రస్తుతం పూర్తిస్థాయిలో దిగుబడులు వస్తుండటంతో ధరలు కొంత మేర తగ్గాయి. బయట మార్కెట్‌లో క్వింటా రూ.3 వేలతో కొనుగోళ్లు జరుగుతున్నాయి. అయితే వర్షాలతో వాయపారులు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంలేదు. వర్షాలు ఉల్లిగడ్డలు దెబ్బతింటే నష్టపోతామనే వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారు. మార్కెట్‌లో ఉల్లి ధరలు ఉన్నప్పటికి వ్యాపారులు ముందకు రావడంలేదని రైతులు అంటున్నారు. వర్షాలతో తడిసిన ఉల్లి గడ్డలను వ్యాపారులు పూర్తిగా కొనుగోలు చేయడంలేదు. గడ్డలు బాగా ఉన్నప్పటికి వర్షాలు తడిసిపోవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బతగులుతోంది.

**తుఫాన్‌తో భయపడుతున్నాం..**



ఉల్లి పంట కాలం పూర్తి కావడంతో గడ్డలను పీకి వేయాల్సి ఉంది. తుఫాన్ ప్రభావంతో ఉల్లి గడ్డలను పీకేందుకు భయపడుతున్నాం. నాకున్న 2 ఎకరాలలో ఉల్లి సాగు చేశా. సాగుకు లక్షకుపైనే పెట్టుబడులు పెట్టా. వర్షాలతో ఉల్లి దెబ్బతింటే తీవ్రంగా నష్టపోతాం.

– చలపతి, ఉల్లి రైతు, వేముల

**మూడు ఎకరాలలో ఉల్లి సాగు చేశా..**



నాకున్న మూడు ఎకరాలలో ఉల్లి సాగు చేశా.. పంట కాలం పూర్తయ్యింది. సాగులో రూ.1.50 లక్షల మేర పెట్టుబడులు పెట్టా. తుఫాన్ వర్షాలతో ఉల్లి గడ్డలను పీకలేకున్నాం. ఉల్లిగడ్డలు పీకి వేశాక వర్షాలు పడితే గడ్డలు కుళ్లిపోతాయని భయపడుతున్నాం. వర్షాలు ఇలాగే ఉంట సాగులో తీవ్రంగా నష్టపోతాం.

– అంకిరెడ్డి, ఉల్లి రైతు, గొందిపల్లె

### మినీ గోకులాల నిర్మాణాలకు భూమిపూజ

**లింగాల :** మండలంలోని అక్కులగారిపల్లె, బోనాల గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలలో భాగంగా మినీ గోకులాల షెడ్ల నిర్మాణానికి సోమవారం అధికారులు భూమిపూజ నిర్వహించారు. ఉపాధి హామి పథకం కింద 10 శాతం రైతు వాటా కింద మినీ గోకులాల షెడ్లను పాడి రైతులకు మంజూరు చేయడం జరిగిందని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ గంగరాజు, పశువైద్యాధికారి మంగేష్, ఉపాధి హామి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో భాగవత సప్తాహం

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని కచేరి రోడ్డులో ఉన్న గీతామందిరంలో సోమవారం భక్తిశ్రద్ధలతో భాగవత సప్తాహం నిర్వహించారు. శ్రీభగవద్గీత ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో భాగవత పండితుడు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి ధృవోపాఖ్యానంపై ఉపన్యాసం చేశారు. ఏడు రోజులపాటు వివిధ ఘట్టాలపై ఉపన్యాసం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వక్తలు, భక్తులు పాల్గొన్నారు.

### గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

**ముద్దనూరు :** పాత కక్షలతో ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మైనుద్దీన్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని సోంపల్లె గ్రామంలో ఘర్షణకు పాల్పడిన కేసు నిందితులకు ఆయన సోమవారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. పోలీసులకు సమస్యలు తెలపకుండా గొడవలకు దిగితే ఇరు వర్గాల వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు భాగస్వాములు కావాలి

**వేంపల్లి :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మానవతా స్వచ్ఛంద సంస్థ మండల శాఖ చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. సోమవారం భారత ప్రభుత్వం క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, వేంపల్లి మానవత సంస్థల ఆధ్వర్యంలో ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యత కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామాలలో చెట్లను పరిరక్షించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర సమన్వయకర్త సుబ్బయ్య, చైతన్య హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్య రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మానవత సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, తదితరులు

## మొబైల్ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**వల్లూరు :** ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో ఆధార్ మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఆధార్ సేవలను అందించడం జరుగుతుందని ఎంపీడీవో రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. 22న పైడికాలువ గ్రామ సచివాలయంలో, 23న లేబాక గ్రామ సచివాలయంలో, 24న వల్లూరు గ్రామ సచివాలయంలో, 25న దిగువపల్లె గ్రామ సచివాలయంలో మొబైల్ ఆధార్ సేవలు అందుబాటలో వుంటాయని తెలిలిపారు. ఇందులో ఆధార్ కార్డుకు సంభందించి చిరునామా మార్పు, ఫొటో మార్పు, ఫోన్ నంబర్ లింక్ చేయడం, వేలి ముద్రలు అప్‌డేట్ చేయడం మొదలైన సేవలు అందిస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**లింగాలలో..**
**లింగాల :** మండలంలో ఈనెల 22 నుంచి 25వ తేదీవరకు మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22వ తేదీన కామసముద్రం, 23న పార్నపల్లె, 24న కోమన్నూతల, 25వ తేదీన లింగాల సచివాలయాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఆధార్ కార్డులలో మార్పులు, చేర్పులు, సవరణలు నిర్వహించుకోవచ్చునన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### అనాథ వృద్ధుడికి ఆసరా

**కమలాపురం :** అనాథ వృద్ధుడి దీనస్థితిని చూసి కమలాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నాడు. పట్టణ పరిధిలోని సరస్వతి జూనియర్ కళాశాల బస్టాపు వద్ద కొన్ని నెలలుగా ఓ అనాథ వృద్ధుడు గాలి, వానతో తిండికి ఇబ్బందులు పడుతున్నాడు. 5 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కదలలేని స్థితికి చేరుకున్నాడు. అతని పరిస్థితిని గమనించిన ఎస్ఐ అభి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు సమాచారాన్ని ఇచ్చారు. ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు వృద్ధుడిని తీసుకెళ్లాలని ఎర్రగుంట్ల మండలంలోని తిప్పలూరు వద్ద వున్న ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథాశ్రమ నిర్వాహకులను కోరారు. స్పందించిన ఆశ్రమ నిర్వాహకులు ఎద్దుల నాగేంద్ర కమలాపురం చేరుకుని వృద్ధుడికి అవసరమైన సేవలను చేసి ఆశ్రమానికి తరలించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



వృద్ధుడిని అనాథ ఆశ్రమానికి తరలిస్తున్న ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

## డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలి

**కమలాపురం :** ఈనెల 29, 30 తేదీల్లో కడప వేదికగా జరగనున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పిలుపునిచ్చారు. కమలాపురంలోని డిగ్రీ కళాశాలలో సోమవారం రాష్ట్ర కమిటీ సమావేశాలకు సంభంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ సమావేశాల్లో కడప ఉక్కు, రాష్ట్ర విభజన హామీల అమలు అజండాగా చర్చించడం జరుగుతుందన్నారు. కొప్పర్తి పారిశ్రామిక కారిడార్‌లో వున్న ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ అమరావతికి తరలించడం ఇక్కడి ప్రజలను అవమానించడమేనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ కేంద్రాన్ని తరలించడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా చౌడేశ్వరిదేవి ఉత్సవాలు

**మైలవరం :** మండలంలోని దొమ్మరనంద్యాల గ్రామంలో చౌడేశ్వరిదేవి ఉత్సవాలను తొగటవీర క్షత్రియులు సోమవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ఉత్సవాలు సోమవారం తెల్లవారే వరకు పురవీదుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ అధికారులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గిరిధర్‌రెడ్డిల ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

**లింగాల :** నేటి నుంచి భూముల రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకంలో పేరు నమోదు కానీ వారు ఒక ఎల్‌పీఎంలో జాయింట్‌గా నమోదు కాబడిన రైతులను విభజన చేయుట, విస్తీర్ణముల వ్యత్యాసం, ఏదైనా సర్వే నెంబర్లు నమోదు కానీ వారు, పట్టాదార పేరు లేదా తండ్రి, భర్త పేర్లు తప్పుగా నమోదైన వారు వారి సమస్యలను ఈ సభలలో పరిష్కరించుకోవాలన్నారు. గతంలో రీ సర్వే అయిన నరసింగరావు రెవెన్యూ గ్రామంలో ఈనెల 22వ తేదీన, 23న హిరోజ్‌పురం, 24, 25వ తేదీలలో రామనూతనపల్లె రెవెన్యూ గ్రామంలో గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**సింహాద్రిపురం :** మండలంలో భూ రీ సర్వే పూర్తయిన గ్రామాలలో నేటి నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ గ్రామ సభలలో రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంగళవారం దేవతాపురం, 23న తెలికి, 24న హిమకుంట్ల, 25న జంగంరెడ్డి పల్లె, 26 సింహాద్రిపురం, 29 నిడివెల్ల గ్రామాలలో ఈ గ్రామ సభలు ఉంటాయన్నారు.

**చింతకొమ్మదిన్నె (వల్లూరు) :** మండలంలోని కమ్మవారిపల్లి గ్రామంలో రీసర్వే సమస్యల పరిష్కారం కొరకు రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించనున్నారు. అడంగల్ ఎంట్రీలో పొరపాట్లు సర్వే విస్తీర్ణం, కొలతలు జాయింట్ ఎల్పీఎంల విభజన సమస్యలకు రైతుల నుంచి రెవెన్యూ అధికారులు అర్జీలు స్వీకరించి తగిన పరిష్కారం చేయనున్నారు. అలాగే చెర్లోపల్లి గ్రామం అక్టోబర్ 24న, పాపాసాహెబ్‌పేట గ్రామం అక్టోబర్ 25న, రుద్రయ్యగారిపల్లె గ్రామం అక్టోబర్ 26న, బాలుపల్లి గ్రామం అక్టోబర్ 29న, బుగ్గలపల్లి గ్రామం అక్టోబర్ 30న, బుగ్గలేటిపల్లి గ్రామం నవంబర్ 2న ఆయా గ్రామ పంచాయతీ సచివాలయాల వద్ద రీసర్వే గ్రామసభలు నిర్వహించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

### పీబీసీ కార్యాలయంలో సిబ్బంది కొరత

**పులివెందుల రూరల్ :** పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న పీబీసీ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కార్యాలయంలో 17 మంది ఏఈలు విధులు నిర్వహించాల్సి ఉండగా.. కేవలం 5 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అలాగే 50 మంది లష్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉండగా.. 12 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరిని సంబంధిత అధికారులు ఔట్ సోర్సింగ్ ద్వారా తీసుకోవాల్సింది ఉండగా.. ఇప్పటివరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపితే సిబ్బంది కొరత తీరే అవకాశం ఉంది.

### పరిస్థితులపై డీఎస్పీ సమీక్ష



సమీక్షలో డీఎస్పీ, సీఐ

**ముద్దనూరు :** స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం రాత్రి శాంతిభద్రతల పరిస్థితులపై ఇన్‌చార్జి డీఎస్పీ రమాకాంత్ సమీక్షించారు. 3 రోజులుగా మద్యం దుకాణాల విషయంలో ముద్దనూరులో జరిగిన సంఘటనలు, ఇతర సమస్యలపై ఆయన వివరాలు సేకరించారు. సమస్యలు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై సీఐ దస్తగిరికి ఆయన సూచించారు. అనంతరం ఇటీవల జరిగిన సంఘటనలపై డీఎస్పీ ఆరా తీసారు.

### నేడు విద్యుత్ అంతరాయం

**పులివెందుల రూరల్ :** పట్టణంలోని 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కె.వి పులివెందుల సబ్‌స్టేషన్ పరిధిలోని మారుతి హాలు రోడ్డు ప్రాంతంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆయన తెలుపుతూ ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని.. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు



భిక్షలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో ఉన్న శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో 41 రోజులపాటు అయ్యప్ప భక్తులకు భిక్ష ఎంఆర్ ఆగ్రోఫాం అధినేత మల్లారెడ్డి ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మంగళవారం ఆలయం వద్ద అయ్యప్ప భక్తులకు బిక్ష ఏర్పాటు చేశారు. ప్రతిరోజు అయ్యప్ప భక్తులు బిక్షకు హాజరు కావాలని ఆయన కోరారు.

### పారిశుద్ధ్యంపై చర్యలు



ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

**ఎర్రగుంట్ల :** మున్సిపల్ పరిధిలోని సుందరయ్య కాలనీలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో నీటిని తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల సుందరయ్యనగర్ కాలనీలో నీరు నిలిచింది. దోమలు వ్యాప్తి చెందకుండా ముందుగానే ఫాగింగ్ చర్యలు చేసినట్లు తెలిపారు.

## సబ్సిడీ శనగ విత్తన పంపిణీ పరిశీలన

**లింగాల :** మండలంలోని పెద్దకుడాల, బోనాల రైతు సేవా కేంద్రాలలో జరుగుతున్న శనగ విత్తన పంపిణీని వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి ఏఓ రమేష్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1128 మంది రైతులకు గాను 1591.80 క్వింటాళ్ల శనగలకు రైతులు నమోదు చేసుకోగా 631 క్వింటాళ్ల శనగ విత్తనాలను పంపిణీ చేశామన్నారు. అలాగే విత్తనాలు తీసుకున్న ప్రతి రైతు కూడా పంట సాగు చేయాలని, విత్తనాలు తీసుకునేటప్పుడు కూడా రైతులు వేలిముద్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జి మౌనిక, జగదీశ్వర్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.



శనగ విత్తన పంపిణీని పరిశీలిస్తున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

## రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయి

**పులివెందుల టౌన్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌లక్ష్మణ్ రెడ్డిలు తెలిపారు. సోమవారం పులివెందులలో వారు విలేకరులతో మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం కనీస భరోసాను కూడా ఇవ్వలేకపోతోందని విమర్శించారు. మహిళలపై జరుగుతున్న దాడులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇందుకేనా ప్రజలు మీకు ఓటు వేసిందని.. రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగిపోతుంటే హోంమంత్రి అనిత వెటకారంగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దిశ యాప్ ఉంటే అభాగ్యులకు న్యాయం జరిగేదని... కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దిశ యాప్‌ను పునరుద్ధరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్కిల్ డెవెలప్‌మెంట్ కోర్సు

**సింహాద్రిపురం :** స్థానిక ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలలో పీఎం కౌశల్ వకాస్ యోజన కింద కొత్తగా స్కిల్ డెవెలప్‌మెంట్ కోరుస్‌ను ప్రారంభిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ కనీసం 8వ తరగతి ఉత్తీర్ణత సాధించి అర్హత కలిగిన అభ్యర్థులు ఈ కోర్సులో చేరవచ్చునన్నారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఎలక్ట్రికల్ రంగంలో మంచి ఉద్యోగ అవకాశాలు పొందటానికి మంచి అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9949678581, 9030614723, అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## రైల్వేస్టేషన్‌లో సమస్యలను పరిష్కరించండి

**ఎర్రగుంట్ల :** స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఎరికలరెడ్డి సోమవారం గుంతకల్ రైల్వే శాఖ ప్రధాన కార్యాయంలో డివిజన్ డీఆర్ఎంను కలసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైన్లు వస్తున్న సమయంలో ట్రైన్ బోగీల నంబర్లు తెలిసేలా డిజిటల్ సదుపాయం కల్పించాలని, రైల్వేస్టేషన్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని పొడగించాలని కోరారు. అండర్‌గ్రౌండ్ బ్రిడ్జిని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. 1, 2 రైల్వే ప్లాట్‌ఫాంలలో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్లాట్‌ఫాం వద్ద ఏర్పాటు చేసిన ప్రైవేటు దుకాణాలలో అధిక ధరలకు అమ్ముతున్నారని దీనిన్ని నిరోధించాలని కోరారు. వాహనాల పార్కింగ్ టెండర్లు పొందిన వ్యక్తి తనకు ఇష్టమొచ్చిన రీతిలో డబ్బులు వసూళ్లు చేస్తున్నారని తెలిపారు



గుంతకల్లు డివిజన్ డీఆర్‌ఎంకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఎరికలరెడ్డి

## ‘సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలుచేస్తారు’

**పులివెందుల రూరల్ :** ఏపీలో సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు అమలుచేస్తారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి వేలూరు శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చి సంపద సృష్టిస్తా, పేదలకు పంచుతా అని చెప్పిన చంద్రబాబు ప్రస్తుతం ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఎప్పటినుంచి అమలు చేస్తారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత సిలిండర్లు అమలు చేస్తామని చెబుతున్నారే తప్ప కార్యరూపం దాల్చలేదని ఆయన మండిపడ్డారు.

### రక్తదానం

**జమ్మలమడుగు :** పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకున్న ప్రతి పోలీసు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కడప ఇన్‌చార్జి డీఎస్పీ రామాకాంత్ తెలిపారు. సోమవారం స్థానిక తాడిపత్రి రోడ్డులో ఉన్న నూతన పోలీసుస్టేషన్‌లో అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సీఐ లింగప్ప రక్తదానం చేయడంతో ఆయనను అభినందించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**చింతకొమ్మదిన్నె(వల్లూరు) :** మండలంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతకొమ్మదిన్నె పోలీసులు అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను, సేవలను గుర్తు చేస్తూ ఊటుకూరు సర్కిల్‌లో, సాక్షి సర్కిల్‌లో, పోలీస్‌స్టేషన్ వద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు.



రక్తదానం చేస్తున్న పోలీసులు

## నేడు సామాజిక తనిఖీపై ప్రజా వేదిక

**జమ్మలమడుగు :** మండలంలో ఉపాధిహామీ కింద జరిగిన పనులకు మంగళవారం ఉదయం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నిసా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 14 పంచాయతీలలో గతేడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు జరిగిన పనులకు సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు.